పవన్‌పై భగ్గుమన్న వలంటీర్లు

- మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడితే ఊరుకునేది లేదు
- మళ్లీ మా జోలికొస్తే తాట తీస్తాం
- యలమంచిలిలో వలంటీర్ల హెచ్చరిక



పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు పాయకరావుపేటలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామ వలంటీర్లు

యలమంచిలి : వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా పవన్‌కల్యాణ్ మాట్లాడితే ఊరుకునేది లేదని యలమంచిలి పట్టణ, మండలంలో వలంటీర్లు అన్నారు. వారాహి యాత్రలో భాగంగా పవన్‌కల్యాణ్ వలంటీర్లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ సోమవారం యలమంచిలి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ తక్షణమే వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా బహిరంగంగా క్షమాపణ తెలపాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కరోనా వంటి కష్ట కాలంలో వలంటీర్లు ప్రాణాలొడ్డి ప్రజలకు సేవలందించారని, ఈ రోజు ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నామని, వలంటీర్ల పై నీచమైన వక్రబుద్ధితో పవన్‌కల్యాణ్ ఒక నియంతలా పిచ్చిప్రేలాపనలు చేయడం, రాష్ట్రంలో వలంటీర్లను కించపరచడం హేయమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులకు వలంటీర్లుగా ఉపాధి కల్పించిన గొప్ప మనస్సున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతులు వస్తుండడం పవన్‌కల్యాణ్‌కు నచ్చక వలంటీర్లపై బురదజల్లి ఎంతో మంది స్త్రీల మనోభావాలను కించపరిచేలా ప్రవర్తించాడని అన్నారు. పవన్‌కల్యాణ్ ప్యాకేజి మత్తులో ఏం మాట్లాడుతున్నాడో తనకే అర్థం కాని పరిస్థితి వచ్చిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల్లో భారీగా అవినీతి మరకలతో టీడీపీ కార్యకర్తలు దోచుకుతిన్నా వారిని ఒక్కసారి కూడా విమర్శించిన పవన్ కల్యాణ్ ప్యాకేజీకి అమ్ముడుపోయి ప్రభుత్వంపైన వలంటీర్లు పైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని, ఈ విధమైన పిచ్చి ప్రేలాపనల వల్ల పవన్‌కు రాష్ట్రంలో మహిళలపై ఏపాటి గౌరవం ఉందో స్పష్టమవుతోందని అన్నారు. వెంటనే వలంటీర్లపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పకపోతే పవన్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యలమంచిలి పట్టణం, మండలంలోని వలంటీర్లు అందరూ పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

పాయకరావుపేట : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గ్రామ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని గ్రామ వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. మండలంలో గల శ్రీరాంపురం గ్రామంలో వలంటీర్లు అందరూ ఏకమై నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసేందుకు తాము ఎంతో కృషి చేస్తున్నామని, అంటువంటి గ్రామ వలంటీర్లను ఇష్టానుసారంగా, అనుచిత వ్యాఖ్యలు చేసి కించపర్చడం పవన్ కల్యాణ్ కు తగదన్నారు. తక్షణమే పవన్ రాష్ట్రంలో గ్రామ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆందోళనలో జె.సి.ఎస్. ఇంచార్జ్ బొలిశెట్టి శ్రీను, పలువురు గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లపై వ్యాఖ్యలు దారుణం



జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదు. ఆయన వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా గ్రామ వలంటీర్లు పని చేస్తున్నారు. తక్షణమే పవన్ కల్యాణ్ తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి.

– బొలిశెట్టి శ్రీను,
జె.సి.ఎస్. ఇన్‌ఛార్జ్, పాయకరావుపేట మండలం

వెంకటేష్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నక్కపల్లి : దేవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పేరూరి కొండబాబు కుటుంబాన్ని సోమవారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరామర్శించారు. కొండబాబు కుమారుడు గ్రామ వలంటీర్ భర్త అయిన పేరూరి వెంకటేష్ ఇటీవల విజయనగరం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాబూరావు వెంకటేష్ భార్య, తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం బీమా సదుపాయాలు త్వరగా వచ్చేలా కృషి చేస్తానని, భర్తను కోల్పోయిన వలంటీర్ మానిక ఉపాధి కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ గొర్ల నర్సింహమూర్తి, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, తాతబాబు, అంగరాజు, రామరాజు పాల్గొన్నారు.



వెంకటేష్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతిపక్షాలు కళ్లతో చూడాలని, అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పీఎల్ పురం గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొంతమంది రాజకీయ నాయకులు పబ్బం గడుపుకోవడం కోసం, ఏమీ పని లేక ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేసి సాగునీరు, తాగునీరు, రోడ్డు సదుపాయాలు కల్పించామన్నారు. నక్కపల్లి డిగ్రీ కళాశాల ఏర్పాటు, నక్కపల్లి, కోటవురట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చేసి 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కనీసం మేనిఫెస్టోలు ప్రకటించలేని పార్టీలకు చెందిన నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీని విమర్శించడం తగదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఉడత బెదిరింపులకు బెదిరిపోయేది లేదన్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణంపై కొందరు నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వారంరోజుల్లో మెయిన్‌రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.

‘పంటలకు మద్దతు ధర ప్రకటించాలి’



సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి) : పంటలకు మద్దతు ధర ఇవ్వాలని ప్రకటించాలని, చక్కెర కర్మాగాలను ఆధునికీకరించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట సచివాలయాల్లో కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారం అందజేయాలని కోరారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



ఆకాశంలో దట్టంగా కమ్మేసిన మేఘం

రాంబిల్లి: పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం పడింది. గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భానుడు భగభగలతో అల్లాడిన ప్రజలు సాయంత్రం పడిన వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భగవద్గీత సారాంశం తెలుసుకోండి



భగవద్గీత పుస్తకాన్ని అందిస్తున్న జ్ఞాన వేదిక సభ్యులు

ఎస్.రాయవరం : భగవద్గీత పఠనంతో జన్మ సార్థకమవుతుందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు శాంతరాజు అన్నారు. కర్రివానిపాలెం గ్రామంలో సోమవారం భగవద్గీత ప్రాముఖ్యం గురించి ప్రచారం చేశారు. హిందూ సంప్రదాయ భక్తులు విధిగా గీత సారాంశం తెలుసుకోవాలన్నారు.

నక్కపల్లి : మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన హౌసింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని పీడీ రామామణి నిర్వహించారు. గ్రామాలవారీగా జగనన్న కాలనీ గృహాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు హౌసింగ్ అసిస్టెంట్లు మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలని ఆదేశించారు. బిల్లులు మంజూరు, సామాగ్రి పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఈ పీవీఎస్ఎస్ ఆర్ ప్రసాద్, ఈడీ విజేయుడు, ఏఈ డీఏ రాజు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల వేగవంతానికి చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రమామణి

నెలాఖరుకు 15 వేల గృహ నిర్మాణాలు పూర్తి

జూలై నెలాఖరు నాటికి అనకాపల్లిజిల్లాలో 15వేల వరకూ జగనన్న గృహ నిర్మాణాలు పూర్తవుతాయని, ఇప్పటికే 13,453 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ కొయ్య రమామణి చెప్పారు. సోమవారం ఉదయం నక్కపల్లిలో తనను కలిసి విలేకర్లతో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 58,084 గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 11,452 గృహాలకు పునాదులు పూర్తయ్యాయని, 23,723 గృహాలు బేస్మెంట్, 2,927 గృహాలు శ్లాబ్ స్థాయిలో ఉన్నాయని, 1657 గృహాలు శ్లాబ్‌లు పూర్తయ్యాయని చెప్పారు.

రీ-సర్వే ద్వారా రైతులకు మేలు


చూచుకొండలో రీ-సర్వేకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలని చూచుకొండ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ కోరారు. చూచుకొండలో సోమవారం జరుగుతున్న రీ-సర్వే పనుల మ్యాప్‌ను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రీ-సర్వే ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, ఇకపై సరిహద్దు గొడవలు ఉండవని అన్నారు. రైతుల నడుమ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎర్రవరంలో ఉపాధి పనుల ప్రారంభం


పనులు ప్రారంభించినందుకు అభివాదం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరంలో నిలిపివేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్ని సోమవారం ప్రారంభించారు. దీంతో కూలీలు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలోని పనులకు సంబంధించి కూలీల మస్తర్లలో బినామీ బాగోతంపై వచ్చిన ఫిర్యాదు మేరకు సచివాలయ అధికారులు నివేదిక తయారు చేసి ఎంపీడీవోకు అందజేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పనుల్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో హామీ కూలీలు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో తిరిగి ఉపాధి పనుల్ని ప్రారంభించడంతో కూలీలు హర్షం తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, పరికరాలు అందజేయాలని కోరారు.

రోటరీ సభ్యులకు సత్కారం


అతిథులను సన్మానించిన హైమా నేత్రాలయం డాక్టర్ ప్రసాద్

పాయకరావుపేట : హైమా నేత్రాలయంలో సోమవారం డాక్టర్ పసగడుగుల శివ రాజా ప్రసాద్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్‌లో వివిధ పదవులకు ఎన్నికైన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు పెదిరెడ్డి చిట్టిబాబు, తుని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఏలూరి బాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాకినాడ నగరం రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ కార్యదర్శిగా అవార్డు వచ్చినందుకు వడ్డాది ఆదిత్య, తుని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా పదవీ స్వీకారం చేసిన వర్మ, తుని రోటరీ క్లబ్ కార్యదర్శిగా పదవీ స్వీకారం చేసిన కిశోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్‌గా సేవలందించిన డాక్టర్ మురళీ కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ధాన్యం సాయి, ఆడపా ప్రకాష్ మాస్టర్, వంక శ్రీను, జాన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుజ్జి

మునగపాక : రైతు పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సేవలందిస్తున్నారని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై స్థానిక ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జితో కలిసి ఆయన విత్తనాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ సత్య రవిరాజ్ పాల్గొన్నారు.

కుండపోత వర్షంతో హర్షాతిరేకం

కోటవురట్ల: మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. చాలా కాలంగా ఎండిపోయిన పంట కాలువల్లోకి జలకళ చేరింది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట మెయిన్ రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని పలువురు అంటున్నారు. ఖరీఫ్ నారు పోసేందుకు ముందుగా దుక్కులు చేయడానికి ఉపకరిస్తుందని చెబుతున్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



పెదకలవలాపల్లి గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. పెదకలవలాపల్లి, వెల్చూరు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా సచివాలయాల వద్దే ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుకుమారవర్మ, తహసీల్దార్ భాగ్యవతి, ఎంపీడీవో కొండలరావు, ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మత్స్యకారులకు మహర్దశ

ఎమ్మెల్యే బాబూరావు



అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: ముఖ్యమంత్రి జగనన్న పాలనలోనే మత్స్యకారులకు మహర్దశ వచ్చి అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం చినతీనార్లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న పాలనలో మత్స్యకారులకు ఎంతో మేలు జరిగిందన్నారు. వేట నిషేధం సమయంలో నష్ట పరిహారం కింద రూ.10 వేలు చెల్లిస్తున్నారని, వేట నిషేధం అమల్లోకి వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా ఈ సాయం అందజేయడం జరుగుతోందన్నారు. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణిస్తే ఏడు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేసిన ప్రభుత్వం మాదేనన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీజిల్‌పై సబ్సిడీని పెంచడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో వేటాడిన మత్స్యసందపను ఎగుమతి దిగుమతులు, మార్కెటింగ్ సదుపాయం, ఇంజన్లు, వలలు, భద్రపరచుకోవడం, మత్స్యసంపదను స్టోర్ చేసుకోవడం కోసం జగనన్న ప్రభుత్వం రాజయ్యపేటలో మినీ జెట్టి ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం వివిధ ధ్రువపత్రాలను అర్జీదారులకు అందజేశారు. ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ , సర్పంచ్ మునలయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు శీరం నర్సింహమూర్తి గోవిందు, ఎరిపల్లి శ్రీను, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు, డీటీ నీరజ, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాల మంజూరు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో అర్హత గల వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నేరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల పీఎల్ పురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో గల ఎస్సీ కాలనీ నుంచి శ్మశానానికి వెళ్లే మార్గం సరిగా లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులు, సర్వేయర్లు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పీఎల్ పురం పరిధిలో గల మెగా జగనన్న కాలనీని ఎమ్మెల్యే పరిశీలించారు. లే అవుట్‌కు సంబంధించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సర్వే చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకుని మరికొంతమంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని ఆదేశించారు. జగనన్న కాలనీకి సంబంధించి విద్యుత్ స్తంభం నుంచి పక్కనే గల ఒక వ్యక్తి అక్రమంగా విద్యుత్‌ను ఉపయోగించుకోవడంపై కూడా ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెగా జగనన్న కాలనీ మ్యాప్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా చేపట్టే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్లను గ్రామస్తులకు, లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, సర్పంచ్ సోమన్నదొర, బీసీ సెల్ అధ్యక్షుడు లోవకుమార్, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ జయప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



అర్హులకు ధ్రువ పత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ

పాయకరావుపేట : గ్రామాల్లో సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ అన్నారు. పాయకరావుపేట సచివాలయం-5 లో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో అందిన 265 అర్జీలను పరిష్కరించిన అర్హులకు రైస్ కార్డులు, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలను జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, రాష్ట్ర లీడ్‌కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి కల్యాణి లక్ష్మణరావు, కార్యదర్శి జె.చంద్రశేఖర్, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు. మంగవరం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి 352 అర్జీలు నమోదు చేశారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు బృందం నిర్వహించిన కార్యక్రమంలో అర్హులకు ధ్రువపత్రాలు అందించారు. సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, డీటీ నూకరాజు, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



కె.వెంకటాపురంలో ధ్రువపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజు, వైస్ ఎంపీపీ సీతారామరాజు

కోటవురట్ల : సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.3.16 లక్షల కోట్లు లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని కె.వెంకటాపురం, రామచంద్రపాలెం గ్రామాలలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కె.వెంకటాపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ సీతారామరాజు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులు, మహిళల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎన్నో పథకాలను అందిస్తున్నారన్నారు. చిన్నారులకు బంగారు భవితను ఇచ్చేందుకు పాఠశాలను అద్భుతంగా అభివృద్ధి చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టి దేశానికి మార్గదర్శకంగా నిలిపారన్నారు. వలంటీర్ల సేవా గుణం వెలకట్టలేనిదన్నారు. పవన్ కల్యాణ్ వలంటీర్లపై విషం కక్కుతూ చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, సర్పంచ్ శ్రీదేవి మంగా ఇందిర భవానీ, ఎంపీటీసీ రత్నం, తహసీల్దారు జానకమ్మ, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : ప్రజా సమస్యలు నేరుగా పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. సోమవారం ఏటికొప్పాక గ్రామం సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 890 మంది లబ్ధిదారులకు ఆయన డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణితో కలసి అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ తమకు అవసరమైన ధ్రువ పత్రాలు స్థానిక సచివాలయంలో అధికారుల ద్వారా పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్‌సీపీ నాయకులు, సేనాపతి రాము, యలమంచిలి మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, ఏటికొప్పాక గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రవి, దిమిలి రమణబాబు, మండల సచివాలయ కన్వీనర్ వీసం వాసు, ఎంపీడీవో అప్పలనాయుడు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి



జేవీపాలెం జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లబాబూరావు

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష ప్రతి ఒక్కరికి ప్రయోజనం చేకూరే కార్యక్రమం అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. జేవీపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న సురక్షతో కుల, ఆదాయ, మ్యుటేషన్ వంటి 11 రకాల ధ్రువ పత్రాలు అందజేస్తున్న చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు వివరించారు. గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా చేపడుతున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఆదేశించారు. పెదఉప్పలం గ్రామంలో ఎంపీడీవో రామచంద్ర బృందంతో జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ లోవ లక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, పెదఉప్పలం, వేమగిరి సర్పంచ్‌లు కోశెట్టి వెంకటరమణ, ముప్పిన అబ్బాయిదొర, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రరావు అప్పారావు, అప్పన్న పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



రామన్నపాలెంలో రేకుల షెడ్‌పై కూలిన వృక్షం

కోటవురట్ల: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి వర్షంతో పాటు ఈదురుగాలులు వీచాయి. పలు రహదారుల్లో చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. రాజుపేట శివారు రామన్నపాలెంలో కొల్లు నారాయణమూర్తి నివసిస్తున్న రేకుల షెడ్‌పై పెద్ద చెట్టు కూలిపోయింది. దాంతో చాలా వరకు రేకులు విరిగిపోయినట్టు నారాయణమూర్తి తెలిపారు. పెద్ద ప్రమాదం తప్పిందని, అయితే షెడ్‌పై కూలిపోవడంతో సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం సంభవించినట్టు తెలిపారు.

నాలుగో రోజుకు రిలే దీక్ష



రిలే నిరాహార దీక్ష చేస్తున్న గిరిజనులు

కోటవురట్ల : రహదారి నిర్మాణం, పాఠశాల ఏర్పాటు చేయాలని అణుకు గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరింది. దీక్షా శిబిరంలో గిరిజనులతో పాటు సీపీఎం నాయకులు పాల్గొన్నారు. తమ ప్రధాన డిమాండ్లు పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని గిరిజనులు స్పష్టం చేశారు. శిబిరంలో సీపీఎం నేత జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

మునగపాక : ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ మునగపాక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎం నేత ఆళ్ల మహేశ్వరరావు, అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలు చెల్లించలేదన్న కారణంగా ఖాతాదారులకు సంబంధించిన అకౌంట్‌ను బ్యాంకు హోల్డ్‌లో పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కూలీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఎం.మన్మథరావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.